క్లుప్తంగా

సాగరమాత దేవాలయంలో భక్తుల సందడి



విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సాగర్‌మాత పుణ్యక్షేత్రానికి తరలి వచ్చారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తులు మొక్కుబడులు జరుగుతున్నాయి. ఉదయం భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్య బలిపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షిణ నిర్వహించారు. ఆ తరువాత జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవాలయానికి ఇన్వర్టర్ బహూకరణ

కారెంపూడి: కారెంపూడి గ్రామ దేవతలు పోలేరమ్మ తల్లి, పాతపాటేశ్వరమ్మ అమ్మవారి దేవాలయాలకు గ్రామానికి చెందిన గణితి అమరయ్యానాయుడు ఇన్వెర్టర్, బ్యాటరీలను ఆదివారం బహూకరించారు. ఆలయ గ్రామ నడిబొడ్డున ఉన్నా కూడా ఇటీవల ఆలయంలో దొంగలు పడి అమ్మవార్ల లక్షలాది రూపాయల సొత్తును అపహరించిన నేపథ్యంలో కరెంటు పోయినప్పుడు కూడా లైట్లు వెలిగేలా అమరయ్య ఆలయానికి ఇన్వెర్టర్ బహూకరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, బొమ్మిన అల్లయ్య, బొమ్మిన హనుమయ్య చేతుల మీదగా వాటిని పెదకాపు బొమ్మిన శ్రీనివాసరావుకు అప్పగించారు. కార్యక్రమంలో పలిశెట్టి కోటేశ్వరరావు (మునసబు) తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షకు 17 మంది విద్యార్థులు

విజయపురిసౌత్: స్థానిక పీటీజీ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో 17 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 28 మంది ప్రవేశ పరీక్షకు హాజరు కావలసి ఉండగా 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చీఫ్ సూపర్నింటెండెంట్ కె శ్రీనునాయక్ తెలిపారు. ఆయన వెంట డిపార్ట్‌మెంటల్ అధికారి మోహన్ ఉన్నారు.

ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపల్‌గా వేణుగోపాల్



విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఆదివారం ఏ వేణుగోపాల్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించిన జి రంగాచార్యులు రిటైర్డ్ కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇదే కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఏ వేణుగోపాల్‌కి ప్రిన్సిపల్ బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా వేణుగోపాల్‌ను ఏపీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వైఎస్ఎస్ చౌదరి, రిటైర్డ్ ప్రిన్సిపల్ రంగాచార్యులు, కళాశాల అధ్యాపకులు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సన్మానించి అభినందించారు.

ట్రాఫిక్ అంతరాయం



గురజాల : వీచిన పెద్ద గాలికి రోడ్డుకు అడ్డంగా పెద్ద చింత చెట్టు నేలకొరిగింది . కారంపూడి టు గురజాల రహదారిపై చర్లగుడిపాడు శివారులో చెట్టు కిందపడడంతో రోడ్డుకు ఇరువైపుల వాహనాలు రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో విద్యుత్ శాఖ, ఆర్ అండ్‌బి అధికారులు రోడ్డుపై అడ్డంగా పడి ఉన్న చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. సుమారుగా అరగంటకు పైగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

వైభవంగా నీలంపాటి అమ్మవారి వేడుకలు



గోలి(రెంటచింతల): మండలంలోని గోలి గ్రామ శివార్లోని అతిపురాతనమైన నాగేంద్ర స్వామి వారి దేవస్థానంలో వెలసిన శ్రీ నీలంపాటి అమ్మవారి ఆలయం 16 రోజుల పండుగ సందర్భంగా ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు అప్పయ్యస్వామి, రామరాజు కేశవరావు నేతృత్వంలో వేకువజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనేక ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వేడుకల మహోత్సవంలో పాల్గొన్న వేలాది మంది భక్తులకు మహాన్నదానం చేశారు. ఆలయ ప్రధాన ధర్మకర్త బత్తినేటి బాల కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు కొండా రామయ్య, ఆవుల వెంకటరెడ్డి, చట్టా శ్రీనివాసరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్

- నేటి నుంచి బైపాస్ నుంచి వన్‌వే ప్రారంభం
- పూర్తి అయిన బైపాస్



ఖలీల్ దాబా వద్ద పూర్తి అయిన బైపాస్

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల ట్రాఫిక్ కష్టాలకు మే 1వ తేదీ నుంచి కొంత మేరా చెక్ పడనుంది. ఏళ్ల తరబడి ట్రాఫిక్ సమస్యతో కొట్టుమిట్టాడుతున్న పట్టణ ప్రజలకు కాస్తంతా ఉరట కలగనుంది. బైపాస్ రోడ్డు పట్టణంలోని ఖలీల్ దాబా సమీపంలో రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తి అయింది. అలాగే పిల్లుట్ల రోడ్డులోని జంక్షన్ వద్ద బ్రిడ్జిలు, రోడ్డు నిర్మాణం పూర్తి కావటంతో హైదరాబాద్ వైపు నుంచి వచ్చే భారీ వాహనాలన్ని ఖలీల్ దాబా నుంచి బైపాస్ రోడ్డు మీదుగా పిల్లుట్ల రోడ్డు జంక్షన్ నుంచి పోలీస్ స్టేషన్ సెంటర్ మీదుగా గుంటూరు, అద్దంకి, ఒంగోలు వెళ్లే విధంగా నామ్ ఎక్స్‌ప్రెస్ హైవేవారు రోడ్డు నిర్మాణాన్ని సిద్ధం చేశారు. ఈ క్రమంలోనే వాహనదారులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జిబ్రా లైన్స్, రేడియం స్టిక్కర్లు, మార్జిన్ లైన్‌లు వంటివి ఏర్పాటు చేశారు. దీంతో ఈ బైపాస్ రోడ్డు వన్ వేను ప్రారంభించనున్నారు. అదేవిధంగా గుంటూరు, అద్దంకి, ఒంగోలు నుంచి వచ్చే వాహనాలు పట్టణంలోని ఐలాండ్ సెంటర్ నుంచి యదావిధిగానే వెళ్లనున్నాయి. అందు కోసం ఐలాండ్ సెంటర్‌లో భారీకేడ్లను, ఆంధ్రబ్యాంక్ సెంటర్‌లో, ఐలాండ్ సెంటర్‌లో, హైస్కూల్ వద్ద భారీకేడ్లను ఏర్పాటు చేశారు. దీని ద్వారా జానపాడు రోడ్డుకు వెళ్లే వాహనాలు పోలీస్ స్టేషన్ సర్కిల్ వద్దకు వచ్చి యూటర్న్ తీసుకొని వెళ్లాల్సి ఉంటుంది. మొత్తం వన్‌వే తో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కానుంది. అయితే మరో రెండు నెలల్లో బైపాస్ రోడ్డు నిర్మిస్తున్న రైల్వే బ్రిడ్జి కూడా పూర్తి కావచ్చింది. ఈ బైపాస్ నిర్మాణానికి గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అహర్నిశలు కృషి చేయటమే కాకుండా పూర్తి కాకుంటే టోల్‌ను నిలిపివేస్తామంటూ ఇటీవలే తుమ్మలచెరువు టోల్‌గేట్ వద్ద నిర్వధిక రిలే నిరాహార దీక్షను కూడా చేశారు. దీంతో నామ్ ఎక్స్‌ప్రెస్ యాజమాన్యం దిగి వచ్చి మే 1 కల్లా పిల్లుట్ల రోడ్డు నుంచి వన్‌వే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మరో రెండు నెలల్లో రైల్వే బ్రిడ్జి నిర్మాణం కూడా శక్తి వంచన లేకుండా పూర్తి చేస్తామని ప్రజల సంక్షమంలో ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు సోమవారం బైపాస్ వన్‌వే ప్రారంభించేందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు కృషి



పిడుగురాళ్ల పట్టణానికి ప్రధానంగా ట్రాఫిక్ సమస్య, ఈ సమస్యకు మే 1వ తేదీ నుంచి వన్‌వే ఏర్పాటు చేసి భారీ వాహనాలను ఐలాండ్ సెంటర్ మీదుగా రాకుండా పిల్లుట్ల రోడ్డు నుంచి పోలీస్ స్టేషన్ సెంటర్ మీదుగా వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది. గుంటూరు, అద్దంకి, ఒంగోలు నుంచి వచ్చే వాహనాలు యధావిధిగా ఐలాండ్ సెంటర్ మీదుగా హైదరాబాద్ వెళ్లేందుకు మధ్యలో భారీ కాట్‌లను ఏర్పాటు చేయటం జరిగింది. బైపాస్‌లో రైల్వే బ్రిడ్జి పూర్తి అయ్యే వరకు ఖలీల్ దాబా నుంచి పిల్లుట్ల రోడ్డు జంక్షన్ మీదుగా, పోలీస్ స్టేషన్, గుంటూరు, అద్దంకి, ఒంగులు వెళ్లే భారీ వాహనాలు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయటం జరిగింది. దీంతో ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది.

– పీవీ ఆంజనేయులు, పిడుగురాళ్ల సీఐ

పల్నాటి సంఘ సంస్కర్త పందిరి గురువులు సేవలు ఎనలేనివి



నివాళులర్పిస్తున్న సభ్యులు

మాచర్ల: దళితుల అభివృద్ధి కోసం, దళితుల ఆలయ ప్రవేశం కోసం స్వాతంత్ర సమరయోధుడు పందిరి గురువులు చేసిన సేవలు ఎనలేనివని మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని గ్రంథాలయంలో జరిగిన పందిరి గురువులు 9వ వర్ధంతి సందర్భంగా వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవ రావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి, రచయిత బెజ్జంకి జగన్నాధచార్యులు పాల్గొని మాట్లాడుతూ కులమత రహిత సమాజం కోసం ఉద్యమించటమే కాకుండా ఆచరించి చూపించిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో పావులూరి సతీష్‌బాబు, మేడం నాగేశ్వర రావు, పందిరి బాల గురవయ్య, ఉప్పుతోళ్ళ రమేష్, చుండూరు సత్యనారాయణ, బచ్చు రాజా, రాజు, లాల్‌సాహెబ్ తదితరులున్నారు.

గంగమ్మ తల్లికి బోనాలు



మాచవరం: మాచవరంలోని జెడ్పీ హైస్కూల్ సమీపంలో వేంచేసి యున్న శ్రీ గంగమ్మ తల్లికి భక్తులు ఆదివారం బోనాలు సమర్పించారు. అధిక సంఖ్యలో మహిళలు తలలపై బోనాలు ధరించి, గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తరలివచ్చి, గ్రామ బొడ్రాయికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గంగమ్మ తల్లి దేవాలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వాసవీ అమ్మవారి జయంతి..

మండలంలోని మోర్జంపాడు, పిన్నెల్లి, మాచవరం గ్రామాల్లో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ వారి చిత్రపటానికి పూల మాలలు వేసి , పూజా కార్యక్రమాలు చేపట్టారు.

వైభవంగా వాసవి అమ్మవారి జయంత్సువం



కారెంపూడిలో పూజలందుకున్న వాసవి అమ్మవారు

కారెంపూడి: దేశభక్తి, సమాజ సేవలను ఆర్యవైశ్యులకు ఉపదేశించి ఆర్య మహాదేవిగా ఆవిర్భవించిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతోత్సవం కారెంపూడిలో ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయంలో అమ్మవారికి వివిధ రకాల ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. లక్షా నూటపదకొండు పుష్పాలతో వాసవి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని రజిత కవచాలంకృతంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. 'ఓం కుసుమ పుత్రీచ విద్మహే కన్యకుమారి ధీమహి తన్నో వాసవి ప్రభోదయాత్' మంత్రాలతో అమ్మవారిని వేలాదిగా భక్తులు స్తుతించి ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం అధ్యక్షుడు చీతిరాల వెంకటకోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి యక్కల శ్రీనివాస రావు, ట్రెజరర్ సూరె కోట్వేరరావు, దేవాలయ నిర్మాణ ప్రధాన కర్త కరాలపాటి సుబ్బారావు, నగరేశ్వరస్వామి దేవాలయ ధర్మకర్త మిత్తింటి సాంబశివ రావు, భవిరిశెట్టి రామారావు వివిధ హోదాల ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, పెద్దలు కార్యక్రమ నిర్వహణలో పాల్గొన్నారు. మహిళలు కోలాట ప్రదర్శనతో అమ్మవారిని స్తుతించారు.

రెంటచింతల: రెంటచింతలలో వేంచేసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి 4640వ జన్మదిన వేడుకలను ఆదివారం భక్తిశ్రద్దలతో వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రేష్ఠి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉదయం గం. 5లకు సుప్రభాత సేవ, గం.5.30 అమ్మవారి దేవస్థానం నందు లలిత విష్ణుసహస్రనామ పారాయణము, గం.6 లకు పతాక ఆవిష్కరణ, గం. 10లకు అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పాలాభిషేకం, 102 మంది మహిళలచే కుంకుమ పూజ జరుగుతుందన్నారు. మధ్యాహ్నం గం.12లకు అమ్మవారి లడ్డు వేలంపాట దేవస్థానంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మధ్యాహ్నం గం.1 తీర్థప్రసాదం, గం. 1.30 లకు భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. సాయంత్రం గం. 6 లనుంచి సోమిశెట్టి రామక్రిష్ణ నేతృత్వంలో కోలాట భజనబృందం సభ్యులు పవిత్రమైన గోవుతో కలసి మేళతాలాలతో అమ్మవారి పతాకాలను చేబూని కీర్తనలను ఆలపిస్తూ రెంటచింతల గ్రామపురవీధులలో భక్తిశ్రద్దలతో నగరసంకీర్తన నిర్వహించడం జరుగుతుందన్నారు.

పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో వేంచేసియున్న వాసవీ అమ్మవారి జన్మదినం సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తుల దర్శనార్ధం ఉన్నారు. ఆర్యవైశ్య మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు వాసవీ అమ్మవారి శోభ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. హాజరైన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.

మాచర్ల: పట్టణంలో వేంచేసియున్న శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారి జన్మదినం సందర్భంగా ఆదివారం ఆలయంలో 102 గోత్రాల కన్యలచే అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా మూలవిరాట్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భారీ స్థాయిలో కన్య స్త్రీలు తరలివచ్చి పూజలో పాల్గొని వందలాది మంది భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

మాచర్ల: పట్టణంలో వేంచేసియున్న బస్టాండ్ ప్రాంతంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి టీడీడీ నుంచి ఐదు ఉత్సవ విగ్రహాలు పంపగా పట్టణంలో ఊరేగింపు నిర్వహించి ఆలయంలో ఉంచారు. సుదర్శన నరసింహ స్వామి, రాజ్యలక్ష్మి, వీరాంజనేయ స్వామి, జయ విజయుల విగ్రహాలను మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, కౌన్సిలర్లు పోలా శ్రీను, గట్ల కోటిరెడ్డి, దేవాలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వీరాంజనేయరెడ్డి, చుండూరు మల్లిఖార్జునరావు, ఓబులశెట్టి వెంకటేశ్వర్లు, బి చెన్నకేశవరావు ఆధ్వర్యంలో పూలు చల్లు, మేళాలతో స్వామి వారికి పూజలు చేస్తూ దేవాలయానికి చేర్చారు. వచ్చే నెల ఈ ఉత్సవ విగ్రహాలను ఆలయం లో ప్రతిష్ఠించనున్నట్లు వారు తెలిపారు.

మాచర్లలో భారీ వర్షం.. పొంగిపొర్లిన కాలువలు




భారీగా కురుస్తున్న వర్షం

మాచర్ల: పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. దాదాపు 40 నిమిషాల పాటు ఎడతెరిపి లేకుండా ఈదురు గాలులతో వర్షం కురిసింది. పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు ఒరిగాయి. ఒక్కసారిగా మధ్యాహ్నం 2గం "ల నుంచి 3గం"ల లోపు భారీ వర్షం కురుస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో వర్షం నీరు రోడ్ల పై పొంగిపొర్లింది. డ్రైనేజీలు వర్షపునీటితో మునిగాయి. బస్టాండ్ వద్ద మరుగుదొడ్ల ముందు భాగంలో ఆర్టీసి బస్టాండ్ కార్యాలయం గోడ పెచ్చులు ఊడి ఒక్కసారిగా రేకులమీద పడడంతో ఆ ప్రాంతంలో ప్రయాణీకులంతా ఉలికిపడి పిడుగుపడినట్లు భావించారు. అయితే ఈ పిట్టగోడ కూలడం వల్ల ఎవరూ ప్రమాదానికి గురికాలేదు. ఈ విషయాన్ని అర్థం కాక బస్టాండ్ పై పిడుగు పిడుగు అంటూ పలువురు ప్రచారం నిర్వహించడంతో ప్రజలు ఆందోళన చెందారు. పిట్టగోడ వర్షం వల్లనాని కూలిపోవడం వల్ల ఈ సంఘటన జరిగిందని, ఆ ప్రాంతంలోని పలువురు నిర్ధారించారు. భారీ వర్షం వలన పట్టణంలో గంట సేపు ప్రజల రాకపోకలకు అంతరాయం జరిగింది. వర్షం వలన ఉన్న చివరి పంటలూ దెబ్బతింటాయని ఆందోళనతో పట్టులు తీసుకొని పొలాలకు ఉరుకులు పరుగులతో వెళ్ళారు.

నేడు కండ్లకుంట సొసైటీ అధ్యక్షుడు ప్రమాణ స్వీకారం

వెల్దుర్తి: కండ్లకుంట సొసైటీ అధ్యక్షుడుగా నియామకమైన తాడికొండ పుల్లారెడ్డి, సొసైటీ అధ్యక్షుడుగా సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సొసైటీ కార్యదర్శి ఈడెబోయిన వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. మండలంలోని పట్లవీడు గ్రామానికి చెందిన తాడికొండ పుల్లారెడ్డి కండ్లకుంట సొసైటీ అధ్యక్షుడుగా సోమవారం ఉదయం 10గం"లకు కండ్లకుంట లోని సొసైటీ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపడతారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మూడు జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు హాజరుకానున్నారు. కార్యక్రమానికి మండలంలోని రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరు కావాలని కోరారు.


నేటి నుంచి ఆలయాల ప్రతిష్ట మహోత్సవం



ప్రతిష్ట మహోత్సవానికి సిద్ధమైన శివాలయం

మిట్టగుడిపాడు(రెంటచింతల): మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో స్వస్తిశ్రీ వ్యవహారిక చాంద్రమానేన శ్రీ శోభకృత్ నామ సంవత్సర వైశాఖమాస శుద్ధ త్రయోదశి సందర్భంగా ఈ నెల 3న దయం గం.8.15 ని.లకు నాగేశ్వరస్వామి ఆలయంలో పార్వతి, గణపతి, సుబ్రమణ్యేశ్వర, చండీశ్వర, నందీశ్వర, శిఖర కలశస్థాపన, వీరాంజనేయస్వామి ఆలయంలో గణపతి, ఒంటేవాహనం, శిఖరం, రామాలయంలో పంచకలశముల ప్రతిష్ఠ మహోత్సవం త్రయెహ్నిక దీక్షతో యాగశాల పరస్పరముగా జరుపుటకు దైవజ్ఞులచే నిర్ణయించిన నేపథ్యంలో సోమవారం నుంచి మూడు రోజులపాటు ఆలయాల ప్రతిష్ఠా మహోత్సవ వేడుకలు బ్రహ్మశ్రీ సాగి నరసింహమూర్తి, బ్రహ్మశ్రీ వెల్లటూరి నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి అయినట్లు సర్పంచ్ గొట్టం ప్రమీల గురవారెడ్డి ఆదివారం తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో చేపట్టిన ఈ ప్రతిష్ఠా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించి స్వామివార్ల కృపకు పాత్రులు కావాలసినదిగా కోరారు.

350 మందికి కంటి పరీక్షలు



రెంటచింతల: స్థానిక వైఆర్ఎస్ ఉన్నత పాఠశాలలో శంకర కంటి ఆస్పత్రి పెదకాకానివారి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిభిరంలో మొత్తం 350 మందికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గుండా జనార్ధన్‌రావు తెలిపారు. పరీక్షల అనంతరం 222 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి వారిని విడతల వారిగా శంకర కంటి ఆస్పత్రికి తీసుకువెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేయడంతోపాటు భోజన సదుపాయం కూడా కల్పిస్తారన్నారు. డాక్టర్లు సాయి స్నేహ, బిపిన్, మేఘన, సిబ్బంది సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో నాశం పెద బాబు, యేచూరి వెంకటసైదయ్య, నాలం చినబాబు, గుండా సుబ్బారావు, ఎక్కల రవి, ఆకుల నర్సింహారావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి మృతి



భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే



మద్దికర వెంకటేశ్వరరెడ్డి (ఫైల్)

దుర్గి: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మామ మద్దికర వెంకటేశ్వరరెడ్డి (72) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం తుది శ్వాస విడిచారు. వంకటేశ్వరరెడ్డి గతంలో అనేక కీలక పదవులను చేపట్టారు. సమితి డైరెక్టర్‌గా మాచర్ల పీఏసీఎస్ అధ్యక్షుడుగా పనిచేశారు. మండల పరిధిలోని కోలగుట్ల గ్రామ అభివృద్ధికి పాటుపడ్డాడు. పలువురు ఉన్నతాధికారులు, నాయకులు ప్రభుత్వ విప్ పీఆర్కేను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. అంత్యక్రియల్లో మూడు జిల్లాల యూత్ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి కుటుంబ సభ్యులు, ఏఎంసి చైర్మన్ వెలిదండి గోపాల్, జెడ్పీటీసి శెట్టిపల్లి యలమంద, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాజీ చైర్మన్ తురక కిషోర్, నాయకులు ఉన్నం పెద్దబ్బాయి, ఎకటీల బుచ్చిబాబు, నక్క ఆదినారాయణ, కటకం చిన్న వెంకటయ్య,తోటకూర నాగేశ్వరరావు, పసుపులేటి వెంకటరామయ్య, మమ్ము శ్రీనివాస్‌రెడ్డి, ఊరు బండి మన్నయ్య, దుర్గి పిఎసిఎస్ అధ్యక్షుడు పాల్వాయి బ్రహ్మానందరెడ్డి, బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, కటకం గోపాల్, జక్కా రమేష్, మోర్తాల ఉమా, శెట్టిపల్లి కోటేశ్వర రావు, నియోజక వర్గ పరిధిలోని పలు గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి అమ్మవారికి, వీర్ల అంకమ్మతల్లికి పూజలు



దాచేపల్లిలో కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

దాచేపల్లి : శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని స్థానిక అమ్మవారి దేవాలయంలో ఆదివారం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారి ప్రసాదంను భక్తులకు అందించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మాశెట్టి బుజ్జి, కనిగిరి బాబురావు, జమాల్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వీర్ల అంకమ్మతల్లికి పూజలు...

శ్రీ వీర్ల అంకమ్మతల్లి కొలుపుల తిరునాళ్ల చివరి రోజైన ఆదివారం అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేసిన తరువాత భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సూమారుగా 15వేలమందికిపైగా ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు కొప్పుల గిరి, దిలిప్, ప్రశాంత్, కుమార్ తదితరులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వైభవంగా ప్రతిష్ట మహోత్సవం



ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

గురజాల : పల్నాటి ప్రాంత ఆరాధ్య దైవం పల్నాటి యాదాద్రి శ్రీ భూ సమేత నరసింహ స్వామి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైయ్యాయి. గురజాల నగర పంచాయతీ జంగ మహేశ్వరపురంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన దేవాలయం ప్రతిష్ఠ మహోత్సవ వేడుకల్లో మొదటి రోజు ప్రారంభమైయ్యాయి. మొదటి రోజు వేకువ జామునుంచి మంగళవాయిద్యాలు, సుప్రబాతము వేదస్వస్తి, గ్రామ ప్రదక్షిణ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, స్నపనవిధి, అఖండ స్థాపన , రక్షా బంధనము, దీక్షా స్వీకరణ, నీరాజన మంత్రపుష్పములు, సాయంత్రం వేళ వాస్తు పూజ, హోమము, మృత్సంగ్రహణము, అంకురారోహణము, అగ్ని ప్రతిష్టాపన మహాకుంభ చక్రాబ్జ మండలారాధనలు, సుదర్శన నారసింహ హోమములు, నీరాజన మంత్రపుష్ప జరుగును. మధ్యాహ్న సమయంలో తిరుమల తిరుపతి దేవస్థాన వేద పండితులచే సామవేద పారాయణం నిర్వహించారు. 50 మందికి పైగా వేదపండితులు మంత్రోచ్చరణతో పారాయణం నిర్వహించడం జరిగింది. మొదటి రోజు దంపతులు కూర్చుని స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో ధ్వజస్థంభంను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు ధ్వజస్తంభంనకు మహిళలు నీటిని వారుగా పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలు దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను కారంపూడి రాఘవచార్యులు, వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో గురువులు, పూర్వ విద్యార్థులు

దాచేపల్లి : ఉల్లాసంగా..ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. నాడు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సత్కరిస్తూ...నాటి జ్ఞాపకాలను నేమరవేసుకుంటు దాచేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1998-99లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. తొలుగు నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లా సెంటర్ నుంచి గురువులతో కలిసి పూర్వ విద్యార్థులు ర్యాలీగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చేరుకున్నారు. ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకుంటూ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. హైస్కూల్‌లో నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. గురువుల పాదాలకు నమస్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం నాటి గురువులు నాగుల్‌మీరా, రామకోటిరెడ్డి, బ్రహ్మారెడ్డి, బాలయేసు, నిర్మల, సత్యనారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులను శాలువా, పూలదండలు, మోమెంటోలతో సన్మానించి సత్కరించారు. హైస్కూల్ అభివృద్ధికి తమవంతు తొడ్పాటు అందిస్తామని పూర్వ విద్యార్థులు చెప్పారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పి. శైలజ, పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు కోటిరెడ్డి, సైదావలి, చాంద్‌బాషా, నడిగడ్డ వెంకటేశ్వర్లు, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజానికి రోటరీ కృషి



మాట్లాడుతున్న రోటరీ క్లబ్ గవర్నర్ రాజశేఖర్‌రెడ్డి

మాచర్ల: దేశంలో వేల కోట్లతో పోలియో వ్యాక్సిన్ పంపిణీ చైతన్య కార్యక్రమం ద్వారా పోలియో రహిత దేశంగా భారత్‌దేశాన్ని మార్చేందుకు రోటరీ క్లబ్ అనేక సంవత్సరాలుగా కీలక పాత్ర వహిస్తూ సేవలందిస్తున్నట్లు రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ తాళ్ళ రాజశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ పి రమేష్‌బాబులు తెలిపారు. ఆదివారం మాచర్ల రూరల్ క్లబ్ విజిట్‌కు వచ్చిన ఆయన రోటరీ సభ్యులతో ఈ ఏడాది జరిగిన కార్యకలాపాలు, సేవా కార్యక్రమాల గురించి సమీక్షించారు. అనంతరం కెసిపి అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో గవర్నర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రోటరీ క్లబ్ విస్తృతమైన సేవలను ఉచితంగా అందిస్తూ ప్రజల మన్ననలను పొందుతుందన్నారు. అందులో భాగంగానే 112 రోటరీ క్లబ్ ల ద్వారా భారత్‌తో పాటు మరికొన్నిదేశాల్లో పోలియో వ్యాక్సిన్ పంపిణీ జరుగుతుందన్నారు. కరోనా సందర్భంగా అనేక కోట్లతో వైద్యాన్ని అందించి ప్రత్యేకంగా చర్యలు తీసుకుందన్నారు. వివిధ ప్రాంతాల్లో క్యాన్సర్ పేషెంట్లకు సేవలందించేందుకు రూ. 2.40 కోట్లతో రెండు బస్సులు కొనుగోలు చేసి ఉచిత వైద్యం క్లబ్ చేయూతనందిస్తుందన్నారు. మూడు జిల్లా కేంద్రాల్లో రోటరీ క్లబ్ ద్వారా డయాలసిస్ సేవలందిస్తున్నట్లు తెలిపారు. మూడు వికలాంగులకు వివిధ వైద్య సేవలందించేందుకు కృషి చేస్తుందన్నారు. 1600ల మందికి కుర్చీలు, 200ల మందికి తోపుడు బండ్లు, వెయ్యి మందితో పాటు 275 మందికి పేషెంట్లకు వీల్‌చైర్లు అందించటం జరిగిందన్నారు. 400 మందికి వీల్‌చైర్‌లు పంపిణీ చేస్తామన్నారు. పేదవాళ్ళందరికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు విశాఖ పట్నంలో రూ. 95లక్షలతో ప్లాస్టిక్ రిసైకిల్ ప్రాజెక్టు ఏర్పాటు చేసి ఆ చుట్టు పక్కల ఉన్న 30 పేదలకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజంలో రోటరీ క్లబ్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ ఏడాది రూ. 29.25కోట్లతో సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు రాజశేఖర్ తెలిపారు.

నేడు మేడే వేడుకలు

గురజాల : నేడు మేడే వేడుకలు నిర్వహించడం జరుగుతుందని సీపీఐ పల్నాడు జిల్లా నాయకుడు షేక్ హుస్సేన్ అన్నారు. కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో కార్మిక జెండాలను ఎగురవేయడం జరుగుతుందని కార్మిక సోదరులు అందరూ పాల్గొని వేడుకలను జయప్రదం చేయాలన్నారు.